
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత ఆదివారం గరిష్ఠం : 31.0 కనిష్ఠం : 23.0
ANDHRAJYOTHY
5

శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
సోమవారం 28 జూలై 2025

• ఏళ్లు గడుస్తున్నా.. ఇంతేనా..?


ప్రహరీలేని బాలుర వసతి గృహం

నంబులపూలకుంటలోని బీసీ బాలుర వసతి గృహం నిర్మించి 15 ఏళ్లవుతోంది. నేటికీ ప్రహరీ మాత్రం నిర్మించలేదు. కదిరి-రాయచోటి ప్రధాన రహదారి పక్కనే హాస్టల్ ఉంది. ఆ రోడ్డులో నిత్యం రద్దీ విపరీతంగా ఉంటుంది. హాస్టల్‌లోని చిన్నారులు ఆడుకుంటూ వెళ్లి ఎక్కడ ప్రమాదాల బారిన పడతారోనని వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. బయటి వ్యక్తులు యథేచ్ఛగా హాస్టల్‌లోకి రావచు. వెంటనే ప్రహరీ నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

-నంబులపూలకుంట(ఆంధ్రజ్యోతి)

ఉభయ సభల కమిటీ సభ్యురాలిగా పల్లె సింధూర



పుట్టపర్తిరూరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మహిళా, శిశు, వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ కమిటీ సభ్యురాలిగా ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి ఎంపికయ్యారు. శాసనసభ స్పీకర్, శాసనమండలి చైర్మన్ ఆధ్వర్యంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఉభయసభల సభ్యులతో సంయుక్త కమిటీలను ఏర్పాటు చేశారు. ఒక్కో కమిటీలో 10 నుంచి 12 మంది సభ్యులను నియమించారు. గౌరు చరిత అధ్యక్షతన ఏర్పాటు చేసిన కమిటీలో సభ్యురాలిగా పల్లె సింధూరా రెడ్డిని నియమించారు.

నేడు పరిష్కార వేదిక

పుట్టపర్తి టౌన్, జూలై27(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ చేతన్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. జిల్లా ప్రజలు తమ సమస్యలపై అర్జీలు ఇచ్చుకోవచ్చన్నారు.

ఎట్టకేలకు ఆక్రమణల తొలగింపు


ఎక్స్‌కవేటర్‌తో ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

కొత్తచెరువు, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నాలుగు రోడ్లకు ఇరువైపులా ఆర్అండ్‌బీ స్థలాలను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను ఎట్టకేలకు ఆదివారం తొలగించారు. ఆక్రమణలను తొలగించుకోవాలంటూ ఆర్అండ్‌బీ, రెవెన్యూ, గ్రామపంచాయతీ అధికారులు. రెండు నెలల క్రితమే 103 మందికి నోటీసులు సైతం అందజేశారు. కొంతమంది స్వచ్ఛందంగా తొలగించుకున్నారు. చాలామంది పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఆర్డీఓ సువర్ణ ఈనెల 26న ఆక్రమణలను తొలగించేందుకు రావడంతో కొందరు అడ్డుకున్నారు. దీనిని ఉన్నతాధికారులు సీరియస్‌గా పరిగణించారు. ఈనేపథ్యంలో ఆర్డీఓ సువర్ణ ఆదివారం దగ్గరుండి ఆక్రమణలను ఎక్స్‌కవేటర్లతో తొలగింపు పనులు చేపట్టారు. నిర్మాణాలను యజమానులు తొలగించుకోవాలనీ, లేదంటే తామే కూల్చేస్తామని ఆమె హెచ్చరించారు.

ప్రత్యామ్నాయమే శరణ్యమా?

ముందస్తుగా నైరుతి రుతుపవనాలు ప్రవేశించినా ఫలితం అంతంతే..

- అరకొర వర్షానికే విత్తనం వేస్తున్న రైతులు
- నెలాఖరుదాకా వేరుశనగ, కంది ఇతర పంటల సాగుకు అనుకూలం
- తర్వాత ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాల్సిందే..


కూడేరు సమీపాన విత్తుకు సిద్ధం చేసిన భూమి

అనంతపురం అర్బన్/కూడేరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): అనంత రైతును ఈసారి వర్షాభావం వెంటాడింది. ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగు ఆశించిన స్థాయిలో ముందుకుసాగలేదు. ఖరీఫ్‌కు ముందు నెలలో పడిన వర్షాలకు పొలాల్లో సేద్యం పనులు చేసుకున్నారు. ఖరీఫ్ సీజన్ ఆరంభమైన జూన్ నెలలో కురిసిన వర్షాలకు అరకొరగా పంటలు సాగు చేశారు. పలు మండలాల్లో కొన్నిరోజులుగా కురుస్తున్న అరకొర వర్షానికే పదును లేకపోయినా కంది, ఇతర పంటలు విత్తుకుంటున్నారు. పదును వర్షం పడకపోవడంతో మరికొందరు వచ్చే నెలలో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకునే ఆలోచనలో ఉన్నారు. నెలాఖలోపు పదును వర్షం పడకపోతే వచ్చే నెలలో ప్రత్యామ్నాయ పంటల సాగు కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలన్న యోచనలో జిల్లా వ్యవసాయ యంత్రాంగం ఉంది.

నెలాఖరు వరకు అవకాశం

వేరుశనగ, కంది, ఆముదం, పత్తి ఇతర రకాల పంటలు సాగు చేసేందుకు నెలాఖరు దాకే అదును సమయం. ఇందుకు మరో నాలుగు రోజులే సమయం ఉంది. ఆలోగా పదును వర్షం పడకపోతే ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాల్సిందే. కొన్ని రోజులుగా ఆకాశం మేఘావృతమవుతున్నా.. జిల్లాలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలకే పరిమితమైంది. అదును సమయం దాటిపోతుందన్న కారణంతో పలు మండలాల్లో అరకొర పదునుకే కంది, ఇతర రకాల పంటలు విత్తుకుంటున్నారు. ఇదివరకు ఓ మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించినా.. ఆశించిన స్థాయిలో పడలేదు. అదును సమయంలోగానైనా పదును వర్షం కురిస్తే విత్తనం వేసుకోవచ్చన్న ఆశతో రైతులు ఎదురుచూస్తున్నారు. నెలాఖరులోగా పదును వర్షం కురవకపోతే ప్రత్యామ్నాయ పంటలైన కొర్ర, ఉలవ, సజ్జలు, అలసంద తదితర పంటల సాగే శరణ్యమన్న అభిప్రాయాన్ని శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

ముందస్తుగా నైరుతి వచ్చినా..!

ఈ ఏడాది ముందస్తుగానే నైరుతి రుతుపవనాలు ప్రవేశించినా ఆశించిన స్థాయిలో వానలు పడటం లేదు. అక్కడక్కడా చిరుజల్లులకే పరిమితమైంది. గతేడాది మే 29వ తేదీ కేరళకు... జూన్ 2న జిల్లాలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. ఈ ఏడాది మే 24న కేరళకు... మే 26న జిల్లాలోకి ప్రవేశించాయి. నైరుతి రుతుపవనాలు ప్రవేశించిన రెండు రోజుల్లో కొన్ని ప్రాంతాల్లో చిరుజల్లుల నుంచి ఓ మోస్తరు వర్షం పడింది. కొన్ని రోజులుగా జిల్లాలో తేలికపాటి వర్షాలే పడుతున్నాయి. వర్షం పడే అవకాశం ఉందని ఇదివరకు పలుమార్లు వాతావరణ శాఖ ప్రకటించినా మేఘావృతం కావడం... తుంపర జల్లులకే పరిమితమైంది. జూన్ సాధారణ

(మిగతా 7వ పేజీలో...)


ఉస్తిలిపల్లి వద్ద రైతుల భూముల్లో వేసిన కాలువ మట్టి

- వ్యవసాయ భూముల్లోకి మట్టి డంప్
- జీవనాధారం కోల్పోతున్న అన్నదాతలు
- పనులను అడ్డుకున్న వైనం

పొలంలో దిబ్బలు

హంద్రీనీవా కాలువ వెడల్పు పనుల్లో ఇష్టారాజ్యం

తనకల్లు, జూలై 27(ఆంధ్రజ్యోతి): భూమే రైతులకు జీవనాధారం. మండలంలోని ఉస్తిలిపల్లికి చెందిన రైతులు గతంలోనే కొంత భూమిని హంద్రీనీవా కాలువ కోసం ఇచ్చారు. చిన్న, సన్నకారు రైతులకు ఒకట్రెండు ఎకరాలు మాత్రమే మిగిలింది. ఆ భూమిలోనే పంటలు పండించుకుని, జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం హంద్రీనీవా కాలువ వెడల్పు, లైనింగ్ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం మూలంగా ఉన్న కొంత భూమి కూడా రైతులకు దక్కకుండా పోతోంది. కాలువ తవ్వకాల ద్వారా వచ్చిన మట్టిని రైతుల భూముల్లోకి ఇష్టారాజ్యంగా డంప్ చేస్తున్నారు. దీంతో తాము జీవనాధారం కోల్పోతున్నామని రైతులు వాపోతున్నారు. మట్టిని తొలగించుకోవాలంటే తమ భూములు అమ్ముకున్నా కుదరదని ఆవేదన చెందుతున్నారు. పాలకులు, ఉన్నతాధికారులు న్యాయం చేయాలని కోరుతున్నారు. అధికారులు వినతులు సమర్పించినా పట్టించుకోకపోవడంతో పనులను అడ్డుకున్నారు. దీంతో కొన్ని రోజులుగా పనులు ఆగిపోయాయి. ఇప్పటికైనా తమకు న్యాయం చేయకుంటే ఆందోళనలు

(మిగతా 7వ పేజీలో...)

ఇదేమి న్యాయం?



చెప్పాపెట్టకుండా కాలువ మట్టిని తీసి, మా భూముల్లో కొండలాగా వేశారు. దానిని తరలించడం మా వల్ల అయ్యే పనికాదు. నా పొలంలో వేసిన మట్టిని తొలగించి, న్యాయం చేయాలి.

- బావయ్య, రైతు, ఉస్తిలిపల్లి

కలలకు రెక్కలు..!

పుట్టపర్తికి ఎయిర్ కనెక్టివిటీపై గతేడాది సమాలోచనలు

- పౌరవిమానయాన సేవల దిశగా అడుగులు
- సత్యసాయి శత జయంత్యుత్సవాలపై ఆశలు

పుట్టపర్తి, జూలై27(ఆంధ్రజ్యోతి): జిల్లాకు ఎయిర్ కనెక్టివిటీ పెంపుతోపాటు పుట్టపర్తి నుంచి పౌరవిమానయాన సేవలు అందుబాటులోకి తెచ్చే దిశగా అడుగులు పడనున్నాయి. గతేడాదే దీనిపై సమాలోచనలు చేశారు. ఈ ఏడాది సత్యసాయిబాబా శత జయంత్యుత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తుండడంతో పౌరవిమాన సేవలపై ఆశలు పెరిగాయి. ఈ ఏడాది అక్టోబరులోనే అందుబాటులోకి రావచ్చన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. అది కార్యరూపం దాల్చితే జిల్లా ప్రజల ఆనందానికి అవధులు ఉండవు. జిల్లా పారిశ్రామిక, వ్యవసాయ, పర్యాటక రంగాల పరంగా అభివృద్ధి చెందుతోంది. పెట్టుబడులకు స్వర్గధామంగా మారింది. దేశవిదేశాల నుంచి రాకపోకలు పెరిగాయి. ఇటీవల ఉమ్మడి జిల్లా నుంచి విమాన ప్రయాణం చేసేవారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈనేపథ్యంలో పుట్టపర్తిలో ట్రస్టు ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీసత్యసాయి విమానాశ్రయాన్ని పౌరవిమానయాన సేవలకు వినియోగించుకునే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కసరత్తు చేస్తున్నాయి. సత్యసాయి శత జయంతి ఉత్సవాల నాటికైనా కార్యరూపం దాల్చాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

పెరగనున్న కనెక్టివిటీ

ఉమ్మడి జిల్లా వాసులతోపాటు దేశవిదేశాల పర్యాటకులు, భక్తులు, వ్యాపారవేత్తలకు కర్ణాటక రాష్ట్రం దేవనహళ్లి అంతర్జాతీయ విమానాశ్రయమే శరణ్యమైంది. విమానాశ్రయానికి చేరుకోవాలంటే రానుపోను అధిక సమయం అవుతుండడంతోపాటు రవాణా ఖర్చులు కూడా వేలల్లో వస్తున్నాయి. ఉమ్మడి జిల్లాకు వీవీఐపీలు, వీఐపీలు, భక్తులు, పారిశ్రామిక వేత్తలు రావాలంటే పుట్టపర్తిలోని విమానాశ్రయం ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు. రెండేళ్లుగా ఎయిర్‌పోర్టుకు ప్రత్యేక విమానాలతోపాటు హెలీకాప్టర్ల రాకపోకలు భారీగానే పెరిగాయి. ఈ నేపథ్యంలో పుట్టపర్తి ఎయిర్‌పోర్టులో పౌరవిమానయాన సేవలు ప్రారంభిస్తే ప్రపంచ దేశాలకు ఎయిర్ కనెక్టివిటీ పెరుగుతుంది.


శ్రీసత్యసాయి ఎయిర్ పోర్టు రన్‌వే

శత జయంతిపై ఆశలు

రాష్ట్రంలో ప్రస్తుత్తం ఉన్న ఏడు ఎయిర్‌పోర్టులను 14కి పెంచేందుకు అవకాశాలపై గత ఏడాది ఆగస్టులోనే సీఎం చంద్రబాబు, కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు ఢిల్లీ వేదికగా చర్చించిన సంగతి తెలిసిందే. పుట్టపర్తిలో శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విమానాశ్రాయం నుంచి పౌరవిమానయాన సేవలు ప్రారభించడంపై సమాలోచనలు చేశారు. ఆ తరువాత దాని గురించి పట్టించుకోలేదు. ఈ ఏడాది నవంబరు 23న సత్యసాయి శత జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భారీ సన్నాహాలు చేస్తోంది. ఇటీవల కొత్తచెరువుకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు పుట్టపర్తిలో సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. సత్యసాయి శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిద్దామనీ, ప్రభుత్వ పరంగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఇప్పటికే శ్రీసత్యసాయి శత జయంతి ఉత్సవాలు రాష్ట్ర పండుగగా నిర్వహించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. మందస్తు ఏర్పాట్లపై అధికార యంత్రాంగం సమీక్షలు చేస్తూ అక్టోబరు 15 నాటికే పూర్తి చేయాలని భావిస్తోంది. దేశవిదేశాల నుంచి భక్తులు, పర్యాటకులు భారీఎత్తున రానున్న నేపథ్యంలో ఎయిర్ కనెక్టివిటీతోపాటు రోడ్డు, రైలు మార్గాల సౌకర్యాలపై ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. పుట్టపర్తి విమానాశ్రయం నుంచి పౌరవిమానయాన సేవలు కూడా దగ్గర్లోనే అందుబాటులోకి తీసుకొచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో సత్యసాయి శత జయంతి ఉత్సవాలపై జిల్లా వాసులు ఆశలు పెట్టుకున్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నాలు, ఆందోళనలు వద్దు

• ఆర్డీఓ కార్యాలయం వద్ద నిర్వహించుకోవాలి: ఎస్పీ

పుట్టపర్తిరూరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నాలు, ఆందోళనలు నిర్వహించకూడదని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్పీ వి.రత్న ఆదివారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. కలెక్టర్ కార్యాలయం రహదారిలో సత్యసాయి విద్యాసంస్థలు, కళాశాలలు ఉండటం వల్ల ఆందోళనలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నాలు, ఆందోళనలను నిషేధించామని వివరించారు. ఎవరైనా వ్యక్తిగత కారణాలు, అజెండాలతో ధర్నాలు చేపట్టి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరంగా శిక్షార్హులు అవుతారన్నారు. ఇక నుంచి ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణాన్ని ధర్నా చౌక్‌గా నిర్ణయించామని, అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, ట్రేడ్‌యూనియన్లు, మహిళా సంఘాలు ఈ విషయాన్ని గమనించాలన్నారు. 30 పోలీసు యాక్ట్ అమలు లో ఉన్నందున వ్యక్తిగత విషయాల కోసం ఆందోళనలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయాలి : ఏపీటీఎఫ్



మాట్లాడుతున్న కోనంకి అశోక్‌కుమార్

కొత్తచెరువు, జూలై 27(ఆంధ్రజ్యోతి): పీఆర్సీ కమిషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనంకి అశోక్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ సత్యసాయి జిల్లా సబ్ కమిటీ సమావేశాన్ని ఆదివారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కోడూరు శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. నూతన పీఆర్సీ 2023 జూలై 1వ తేదీ నుంచి అమలులోకి రావలసి ఉందన్నారు. రెండేళ్లయినా పీఆర్సీ కమిషన్‌ను నియమించకుండా నిర్లక్ష్యం చేస్తూ ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గాలను తీవ్ర నిరాశకు గురిచేస్తోందన్నారు. పీఆర్సీ కమిషన్‌ను నియమించి మధ్యంతర భృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఇప్పటికి మూడు డీఏలు బకాయిలు ఉన్నప్పటికీ ఒక్క డీఏ కూడా ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్ర, నాయకులు బీకే ముత్యాలప్ప, పీవీ మాధవ, త్రిమూర్తి, ఆదిబయన్న, రవీంద్రారెడ్డి, బలరాం, శ్రీనివాసులు, గోపాల్, వెంకటరమణనాయక్, రాజశేఖర్ పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

అనంతపురం క్రైం, జూలై 27(ఆంధ్రజ్యోతి): చిన్నపాటి వివాదానికి క్షణికావేశంలో ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్నారు. నగరంలోని మెడికల్ కాలేజ్ క్వార్టర్స్‌లో ఉంటున్న వినోది(40) అనే మహిళ కుటుంబ కలహాలతో ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. టూటౌన్ పోలీసులు తెలిపిన మేరకు... కడప జిల్లాకు చెందిన దంపతులు మెడికల్ కాలేజ్ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి 10వ తరగతి చదివే ఒక కుమారుడు ఉన్నాడు. వినోదిని గృహిణి కాగా ఆమె భర్త రాజశేఖర్‌రెడ్డి అనంతపురం ప్రభుత్వాసుపత్రిలోని సర్జన్ విభాగంలో పనిచేస్తున్నారు. మధ్యాహ్నం కొడుకు సెల్‌ఫోన్ చూస్తుండగా.. మందలించినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో భర్త కలుగజేసుకోవడంతో చిన్నపాటి వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో ఆమె భావోద్వేగానికి గురై గదిలోకి వెళ్లి గడియ పెట్టుకుంది. ఆమె కొంతసేపటి తర్వాత వస్తుందిలే అనుకుని భర్త, కొడుకు అన్నం తింటున్నారు. చాలాసేపటి వరకూ బయటకు రాకపోవడంతో గది తలుపు తట్టారు. తెరవకపోవడంతో అనుమానం వచ్చి గట్టిగా బద్దలు కొట్టి వెళ్లి చూడగా.. ఆమె ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించింది. వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మరణించినట్టు నిర్ధారించారు. ఈ మేరకు టూటౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిదండ్రులు మందలించారని యువతి..

గుంతకల్లు(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు మందలించారన్న కారణంగా పట్టణానికి చెందిన శృతి (18) అనే యువతి ఆత్మహత్యకు పాల్పడింది. పట్టణానికి చెందిన మోహన్, లక్ష్మీదేవి కుమార్తె శృతి స్థానిక ఓ ప్రైవేటు కళాశాలలో సెకెండ్ ఇంటర్ చదువుతోంది. శృతి సెల్‌ఫోన్‌లో ఇతరులతో ఎక్కువగా మాట్లాడుతుండటంతో గమనించిన తల్లిదండ్రులు మందలించారు. దీంతో ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో శృతి ఉరివేసుకుని మృతి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

రాయదుర్గంరూరల్, జూలై27(ఆంధ్రజ్యోతి): కూతురిని చూసేందుకు బుల్లెట్ వాహనంపై వెళుతూ మసూద్‌బేగం(55) అనే మహిళ మండలంలోని కదరంపల్లి వద్ద ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందింది. బంధువులు, స్థానికులు తెలిపిన మేరకు.. గుమ్మఘట్ట మండలం నేత్రపల్లికి చెందిన మసూదాబేగం మనవడితో కలిసి బుల్లెట్ వాహనంలో నేత్రపల్లి నుంచి కణేకల్లు క్రాస్‌కు వెళుతున్నారు. అనంతపురం-రాయదుర్గం జాతీయ రహదారిపై కదరంపల్లి వద్ద ఆమె చీరకొంగు బుల్లెట్ వాహనం చక్రంలో ఇరుక్కోవడంతో ఒక్కసారిగా తారురోడ్డుపై పడడంతో తలకు తీవ్రమైన గాయాలు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ద్విచక్రవాహనం నడుపుతున్న మనవడికి ఎలాంటి ప్రమాదం జరుగలేదు. మృతురాలికి భర్త పీరాసాబ్‌తో పాటు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేయాల్సి ఉంది.

నేత్రదానంతో ఇద్దరికి కంటిచూపు



షేక్‌బాషా (ఫైల్)

ధర్మవరం, జూలై27(ఆంధ్రజ్యోతి): నేత్రదానంతో మరో ఇద్దరికి కంటిచూపు ప్రసాదించవచ్చని యువర్స్ ఫౌండేషన్ సభ్యులు పేర్కొన్నారు. పట్టణ సమీపంలోని తుంపర్తి కాలనీకి చెందిన షేక్ బాషా(60) ఆదివారం అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి డీవై కుళాయప్ప, కంటి రెట్రావైల్ సెంటర్ టెక్నీషియన్ రాఘవేంద్ర మృతుడి కుటుంబసభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించి వారి సహకారంతో నేత్రాలను సేకరించారు. మృతుడి భార్య షహీద, కుమార్తె సదాను సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో సభ్యులు మోహన్, లోకేశ్ పాల్గొన్నారు.

వేడినీళ్లు పడి చిన్నారి మృతి

అనంతపురం క్రైం, జూలై27(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీకృష్ణదేవరాయ నగర్‌లో చిన్నారిపై వేడి నీళ్లు పడి మరణించింది. వన్‌టౌన్ పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకృష్ణదేవరాయ నగర్‌లో ఫయాజ్, భాను దంపతులు నివాసం ఉంటున్నారు. ఫయాజ్ కియలో డ్రైవర్‌గా, భాను క్యాటరింగ్ పనులకు వెళ్తుండేవారు. పనులకు వెళ్లినపుడు కూతురు సాబియా(5)ను ఇంటికి ఎదురుగా ఉన్న రత్నమ్మ ఇంట్లో వదిలేవారు. శనివారం రాత్రి అక్కడే నిద్రపోయింది. ఆదివారం ఉదయం స్నానం కోసం రత్నమ్మ కొడుకు వేడి నీళ్ల పాత్ర తీసుకెళ్తుండగా జారిపడి సాబియాతోపాటు, మరో ఇద్దరు పిల్లలపై పడ్డాయి. ఇద్దరు పిల్లల భుజాలపై పడి స్వల్ప గాయాలు కాగా, సాబియాకు కడుపు, గొంతు కిందిభాగంలో పడటంతో 60 శాతం వరకూ కాలిన గాయాలయ్యాయి. హుటాహుటిన ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలిస్తుండగా గుత్తి సమీపానికి వెళ్లేసరికి బాలిక మరణించింది. సాబియా మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

స్పీడ్ అందుకోలేదు..!

తపాలా సేవలకు సర్వర్ సమస్య
కార్యాలయంలో తప్పని పడిగాపులు
వినియోగదారుల సహనానికి పరీక్ష



పోస్టు చేయడానికి వచ్చిన వినియోగదారులు

అనంతపురం విద్య, జూలై 27(ఆంధ్రజ్యోతి): తపాలా కార్యాలయాల్లో వినియోగదారులకు సేవలను మరింత స్పీడ్ చేయాలని తలపెట్టిన కొత్త సాఫ్ట్‌వేర్‌కు సమస్యలు వెంటాడుతున్నాయి. కేంద్రప్రభుత్వం కొత్తగా 2.0 ఆన్‌లైన్ యాప్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇక ఇంటి నుంచే తపాలా బుకింగ్ సేవలు పొందవచ్చని ఆ శాఖ అధికారులు గొప్పగా చెప్పారు. రిజిస్టర్ పోస్టు, స్పీడ్ పోస్టులు చేయాలంటే పోస్టాఫీసులకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. అనుకున్నట్లుగానే ఈనెల 20వ తేదీ నుంచి 22వరకు నూతన సాఫ్ట్‌వేర్‌ను పొందుపరిచి సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో గతంలో మాదిరి రోజులు తరబడి ఎదురుచూడాల్సిన పని ఉండదు.. ఏ రోజుకారోజు తమ పోస్టులను అనుకున్న వారికి అందుతాయని వినియోగదారులు ఆనందపడ్డారు. కొత్త సాఫ్ట్‌వేర్ ద్వారా సేవలు మొదలు పెట్టి వారం రోజులు కావస్తున్నా.. అనుకున్న మేరకు సేవలు అందడంలేదు. రిజిస్టర్ పోస్టు కూడా చేయలేకపోతున్నారు. రెండు మూడు రోజులు తపాలా కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోంది. సర్వర్ సమస్యతో సకాలంలో పోస్టు చేయలేకపోతున్నారు. మరోవైపు కొత్త సాఫ్ట్‌వేర్ పనితీరుపై సిబ్బందికి సరైన అవగాహన లేకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీంతో వినియోగదారులు పడిగాపులు కాయాల్సి వస్తోంది. జిల్లా కేంద్రంలోని ప్రధాన తపాలా కార్యాలయంలోనే ఈ పరిస్థితి ఉంటే.. ఇతర ప్రాంతాల్లో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థమవుతోంది. తపాలా సిబ్బందిలోనే కొత్తసేవలపై భిన్నస్వరాలు వినిపిస్తున్నాయి. పోస్టుమ్యాన్‌లకు పరికరం ఇవ్వకుండానే సొంతఫోన్లలోనే డోర్‌స్టెప్ సర్వీస్‌యాప్ డౌన్‌లోడ్‌చేసుకొని సేవలందించాలని చెప్పడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఓ పథకం పెట్టినపుడు అందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని మరికొందరు అంటున్నారు.

పోస్టల్ ఎస్పీ వింత సమాధానం

పోస్టల్ సేవలలో అంతరాయం ఏర్పడి వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోజూ గంటల తరబడి పడిగాపులు కాస్తూ నరకం చూస్తున్నారు. తపాలా కార్యాలయ సిబ్బందిని అడిగితే సర్వర్ సమస్య అని తప్పించుకుంటున్నారు. బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన జిల్లా తపాలా శాఖ సూపరింటెండెంట్ ఆదినారాయణ మాత్రం వింత సమాధానం చెప్పి తప్పించుకుంటున్నారు. శనివారం ఈ సమస్యపై ఆయనను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. 'నేను ఇన్‌చార్జ్‌ను.. ఇపుడు అక్కడ లేను.. నీకేమైనా కావాలంటే మా ఏఎస్పీని అడగండి' అంటూ సమాధానం ఇచ్చి ఫోన్ పెట్టేశారు. వినియోగదారుల సేవలపై ఆయన ఎంత బాధ్యతగా వ్యవహరిస్తున్నారో తెలుసుకోవచ్చు.

రెండు రోజులుగా తిరుగుతున్నా



మా స్కూల్‌కు సంబంధించిన సమాచారాన్ని తపాలా కార్యాలయంలో రిజిస్టర్ పోస్టుచేసి పంపాల్సి ఉంది. రెండురోజులుగా జిల్లా పోస్టాఫీస్‌కు వస్తున్నా.. ఇక్కడికి వచ్చి క్యూలో గంటలకొద్దీ దగ్గరకు వెళితే.. తీరా సర్వర్ పనిచేయలేదంటున్నారు. రెండురోజులుగా తపాలా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పని కాలేదు.

-ఎర్రిస్వామి, అనంతపురం

జిల్లా కార్యాలయంలోనే ఇలా ఉంటే ఎలా..?



నాది ఆత్మకూరు. ఒక రిజిస్టర్ పోస్టు చేయాల్సి ఉంది. జిల్లా తపాలా కార్యాలయంలో సులభంగా పోస్టు చేయొచ్చని వచ్చా. మూడురోజులుగా తిరుగుతున్నా ఒక రిజిస్టర్ పోస్టు చేయలేకపోతున్నా. ఏమంటే సర్వర్ పనిచేయడం లేదంటున్నారు. ఇది పద్ధతికాదు.. ఈ సమస్య పరిష్కరించి వినియోగదారుల కష్టాలు తీర్చాలి.


-నాగరాజు, ఆత్మకూరు

బీమాను సద్వినియోగం చేసుకోండి

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అర్బన్, జూలై 27(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై), వాతావరణ ఆధారిత పంటల బీమాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపిక చేసిన పంటలను పండించే రైతులు, కౌలు రైతులు రెండు పంటల బీమా పథకాలకు అర్హులని తెలిపారు. నోటిఫికేషన్‌లో పొందుపర్చిన గడువులోగా బ్యాంకులో రుణం తీసుకున్న రైతులు, రుణం పొందని రైతులు ఈ పథకంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్‌లో ఈ ఏడాది ఖరీఫ్ నుంచి నమోదు చేసుకోవచ్చు అన్నారు. బ్యాంకులో పంట రుణం పొందిన రైతులతో బ్యాంక్ సిబ్బంది పంటలకు ఇచ్చిన రుణం నుంచి ప్రీమియం సొమ్ము బీమా కోసం జమ చేస్తారన్నారు. ముందుగానే రుణం తీసుకున్న రైతులు బ్యాంక్ అధికారులకు సంప్రదిస్తే తిరిగి ప్రీమియం మొత్తాన్ని చెల్లిస్తారన్నారు. రుణం తీసుకోని రైతులు స్వతహాగా కామన్ సర్వీస్ సెంటర్, ఎన్‌సీఐపీ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఇందు కోసం ఆధార్, భూమి పత్రాలు, కౌలు రైతులు సీసీఆర్సీ కార్డు, రైతు డిక్లరేషన్ లేనిపక్షంలో పంట వేసినట్లు ధ్రువీకరణ పత్రాన్ని ఆర్ఎస్‌కే సిబ్బందితో తీసుకోవాలన్నారు. ఈ పంట నమోదు చేసుకున్న పత్రం, సెల్ నెంబర్, రైతు సేవింగ్ ఖాతా వివరాలు అవసరమన్నారు.

ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన



ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకం కింద కంది పంటను గ్రామం యూనిట్‌గా, వరి, జొన్న, మొక్కజొన్న, ఆముదం, ఎండుమిరప పంటలను మండలం యూనిట్‌గా పరిగణించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో జిల్లాలో ఫ్యూచర్ జనరలీ కంపెనీ ద్వారా ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. దిగుబడి ఆధారిత పంటల విషయంలో పంట కోత ప్రయోగాల ద్వారా లెక్కించిన వాస్తవ దిగుబడిని.. గత 7 సంవత్సరాల దిగుబడి ఆధారంగా లెక్కించి, దిగుబడి తగ్గినపుడు బీమా వర్తింపజేస్తారు.

ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన ప్రీమియం వివరాలు

పంట పేరు	బీమా మొత్తం (హెక్టారుకు)	రైతు చెల్లించాల్సిన మొత్తం ఎకరాలకు	హెక్టారుకు	గడువు తేదీ
కంది	50,000	80	200	జూలై 31
వరి	1,02,500	164	410	ఆగస్టు 15
జొన్న	52,500	84	210	జూలై 31
మొక్కజొన్న	82,500	132	330	జూలై 31
ఆముదం	50,000	80	200	జూలై 31
ఎండు మిరప	2,25,000	576	1400	జూలై 31

వాతావరణ ఆధారిత బీమా

వాతావరణ ఆధారిత బీమా ప్రీమియం చెల్లించేందుకు ఈనెల 15వతేదీ వరకే గడువు ఉండేదని, జిల్లాలో నెలకొన్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పంటల సాగుకు ఇంకా సమయం ఉండటంతో ఈనెల 31వతేదీ దాకా గడువు పొడిగించారని జిల్లా వ్యవసాయ అధికారి పేర్కొన్నారు. వాతావరణ ఆధారిత బీమా కింద జిల్లాలో వేరుశనగ, పత్తి, దానిమ్మ, చీనీ, టమోటా, అరటి పంటలకు వర్తింపజేశారు. ఆయా పంటలను మండల యూనిట్‌గా పరిగణించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో జిల్లాలో అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ద్వారా ఈ పథకాన్ని అమలు చేస్తారు. ఈ ఏడాది జూలై 1 వతేదీ నుంచి వచ్చే ఏడాది మే నెలాఖరుదాకా ఏడాది కాలం వ్యవధిలో అల్ప, అధిక వర్షపాతం, గాలిలో తేమ శాతం, గాలి వేగం, అధిక ఉష్ణోగ్రతలకు సంబంధించిన పరిణామాలను మండల స్థాయిలో లెక్కించి, బీమాను వర్తింపజేస్తారు.

వాతావరణ ఆధారిత బీమా ప్రీమియం వివరాలు..

పంట పేరు	బీమా మొత్తం (హెక్టారుకు)	రైతు చెల్లించాల్సిన మొత్తం ఎకరాకు	హెక్టారుకు
వేరుశనగ	80,000	640	1600
పత్తి	95,000	1140	1600
దానిమ్మ	1,87,500	3750	9375
చీనీ	1,37,500	2750	6875
టమోటా	80,000	1600	4000
అరటి	1,50,000	3000	7500

అట్టహాసంగా చందన షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవం

సందడి చేసిన సినీతార నిధి అగర్వాల్
కేరింతలు కొట్టిన యువత



చందన షాపింగ్‌మాల్‌ను ప్రారంభిస్తున్న నిధి అగర్వాల్

అనంతపురం టౌన్, జూలై 27(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సూర్యానగర్ 80 అడుగుల రోడ్డు సర్కిల్ వద్ద నూతనగా ఏర్పాటు చేసిన చందన షాపింగ్‌మాల్ 3వ బ్రాంచి ప్రారంభోత్సవాన్ని ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. కార్యక్రమానికి అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, అర్బన్ బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్‌తోపాటు సినీ హీరోయిన్ నిధి అగర్వాల్ ముఖ్య అతిథులుగా హాజరై షాపింగ్‌మాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. జిల్లాలో తయారైన పట్టుచీరలను చందన షాపింగ్‌మాల్ నిర్వాహకులు తీసుకుని విక్రయించి, తయారీదారులకు ఉపాధి కల్పించాలన్నారు. స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. సినీనటి నిధి అగర్వాల్ మాట్లాడుతూ... మధ్యతరగతి ప్రజలకు సైతం అందుబాటు ధరల్లో ఉండేలా చందన షాపింగ్‌మాల్‌ను అనంతలో నెలకొల్పడం శుభపరిణామం అన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. చందన షాపింగ్‌మాల్‌గా కొత్త బ్రాండ్‌తో ఏర్పాటైన తర్వాత సుల్లూరుపేట, ఆదోని తర్వాత అనంతపురం జిల్లాలో మూడో బ్రాంచ్‌ను ఏర్పాటు చేశారని, త్వరలో మదనపల్లిలో మరో బ్రాంచ్‌ను ఏర్పాటు చేయనున్నారని తెలిపారు. చందన షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవానికి సినీ హీరోయిన్ వస్తున్నారన్న సమాచారంతో అభిమానులు, యువత పెద్దసంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. సినీతార అక్కడికి చేరుకోగానే ఈలలు వేస్తూ కేరింతలు కొట్టారు. నిధి అగర్వాల్ అభిమానులను పలకరిస్తూ మరింత ఉత్తేజపరిచారు. కార్యక్రమంలో కోనంకి గంగారాం, చందన షాపింగ్‌మాల్ యాజమాన్యం మావూరి శ్రీనివాసరావు, సంతోష్, రామ్మోహన్, వెంకట గణేష్ పాల్గొన్నారు.

పొలంలో దిబ్బలు


(5వ పేజీ తరువాయి)

చేపడతామని రైతులు హెచ్చరిస్తున్నారు.

గుట్టలుగా మట్టి

హంద్రీనీవా కాలువ తవ్వినపుడు ప్రభుత్వం భూమి సేకరించింది. సంబంధిత రైతులకు పరిహారం కూడా చెల్లించింది. ప్రస్తుతం కాలువ వెడల్పు, లైనింగ్ పనులు చేపడుతున్నారు. ఉస్తిలిపల్లి వద్ద కాలువ ఎక్కువ లోతు తవ్వాల్సి వస్తోంది. దీంతో మట్టి భారీగా తవ్వుతున్నారు. ఆ మట్టిని ప్రభుత్వం సేకరించని, రైతుల భూముల్లో వేస్తున్నారు. గుట్టలుగా మట్టి వేశారు. గతంలోనే కాలువకు భూమిని కోల్పోయామనీ, ఇప్పుడు మిగిలిన కొంతలోనూ మట్టి వేస్తే తమ పరిస్థితి ఏంటని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం పరిహారం చెల్లిస్తామన్నా తాము ఒప్పుకునేది లేదన్నారు.

భూమి అమ్మినా.. మట్టిని తరలించలేం



: రామచంద్ర, రైతు, ఉస్తిలిపల్లి

హంద్రీనీవా కాలువ కాంట్రాక్టర్ మా భూమిలో పెద్ద కొండలా కాలువ మట్టిని నింపేశాడు. దీంతో రెండెకరాల వ్యవసాయ పొలం కోల్పోయా. ఆ మట్టిని తరలించాలంటే నాకున్న రెండెకరాలు అమ్మినా కుదరదు. ప్రభుత్వం, అధికారులు న్యాయం చేయాలి.

నింబధనలు పాటిస్తున్నాం

: వెంకటరత్నం, హెచ్ఎన్ఎస్ఎస్ కాంట్రాక్టర్

హంద్రీనీవా కాలువ పనుల కోసం గతంలో ప్రభుత్వం భూ సేకరణ చేపట్టింది.కాలువల్లో తవ్విన మట్టిని ప్రభుత్వం సేకరించిన భూముల్లోనే వేస్తున్నాం. పొరబాటున రైతుల భూముల్లో పడి ఉండుంటే వెంటనే తొలగిస్తాం. మూడురోజుల్లోగా సర్వే చేయిస్తాం.

లిక్కర్ స్కామ్ డబ్బు స్వాధీనం చేసుకోవాలి

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ



మీడియాతో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ

అనంతపురం విద్య, జూలై27(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో లిక్కర్ స్కామ్ ద్వారా కొట్టేసిన డబ్బులు, ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ డిమాండ్ చేశారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. దాదాపు రూ.3,500 కోట్ల లిక్కర్‌స్కామ్ జరిగిందని రాష్ట్ర ప్రభుత్వం, విచారణ చేస్తున్న సిట్ చెబుతున్నాయన్నారు. ప్రజల సొమ్మును లిక్కర్ రూపంలో దోచుకున్నది నిజమైతే దానిని స్వాధీనం చేసుకుని, ప్రభుత్వ ఖజానాకు జమ చేసినపుడే ఫలితం ఉంటుందని సూచించారు. అప్పుడే సిట్‌పై కూడా విశ్వాసం పెరుగుతుందన్నారు. టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నపుడు విద్యుత్ చార్జీల పెంపు, స్మార్టుమీటర్ల బిగింపు, అదానీకి కాంట్రాక్ట్ కట్టబెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకించిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చాక వాటిగురించి మాట్లాడకపోగా.. అమలు చేయడం దుర్మార్గమన్నారు. వీటిని వ్యతిరేకిస్తూ ఆగస్టు 5వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద ఆందోళనలు చేపడతామన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జగదీష్, అనంత జిల్లా కార్యదర్శి జాఫర్, నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయమే శరణ్యమా..?

(5వ పేజీ తరువాయి)

వర్షపాతం 61.0 మి.మీలు కాగా.. ఈ ఏడాది 47.9 మి.మీ.కే పరిమితమైంది. జూలై నెల సాధారణ వర్షపాతం 63.9 మి.మీ, కాగా ఇప్పటిదాకా 34.1 మి.మీ, వర్షపాతం నమోదైంది.

అరకొరగానే పంటల సాగు..

ఈ ఏడాది ఖరీఫ్‌లో జిల్లా సరాసరి సాగు విస్తీర్ణం 3.43 లక్షల హెక్టార్లుగా నిర్ణయించారు. ఇందులో వేరుశనగ 1.82 లక్షలు, కంది 55,296, పత్తి 44 వేలు, ఆముదం 16,293, వరి 19,466, జొన్న 1,719, సజ్జ 2,054, మొక్కజొన్న 14,653, రాగి 69, కొర్ర 3,311, పెసలు 455 హెక్టార్లలో సాగవుతాయని అంచనా వేశారు. మిగతా విస్తీర్ణంలో ఉలవలు, మినుములు, అలసంద తదితర రకాల పంటలున్నాయి. ఈ సారి ఆశించిన స్థాయిలో వానలు పడకపోవడంతో అరకొరగానే పంటలు సాగయ్యాయి. జిల్లావ్యాప్తంగా ఇప్పటిదాకా 1.07 లక్షల హెక్టార్లలో (31 శాతం) మాత్రమే వివిధ రకాల పంటలు సాగయ్యాయి. ఇందులో వేరుశనగ 38,104 హెక్టార్లలో మాత్రమే సాగైంది. మిగతా విస్తీర్ణంలో కంది, మొక్కజొన్న, ఆముదం, పత్తి, సజ్జల పంటలు వేశారు.

అరకొర తేమలోనే విత్తనం వేశా:

అంతర గంగన్న, రైతు, కరుట్లపల్లి, కూడేరు మండలం



దేవుడిపై భారం వేసి 9.30 ఎకరాల్లో అరకొర తేమలోనే కంది పంట వేశా. పది రోజుల క్రితం ఐదు, ఐదు రోజుల క్రితం మిగిలిన పొలంలో కంది పంట వేశా. వచ్చేనెలలోనైనా వర్షాలు పడకపోతాయా అని ఆశతో ఎదురుచూస్తున్నాం. గతేడాది మాదిరిగానే ఈ సారి సరిగా వానలు పడటం లేదు. వానలు సమృద్ధిగా కురిస్తే ఈ ఏడాది గట్టెక్కుతాం. లేదంటే పూర్తిగా నష్టపోవాల్సిందే.

నెలాఖరు దాకా అదును:

చంద్రాయుడు, కళ్యాణదుర్గం కేవీకే ప్రధాన శాస్త్రవేత్త



నెలాఖరు దాకే వేరుశనగ, కంది ఇతర ప్రధాన పంటల సాగుకు అదును సమయం. అప్పటిలోగా పదును వర్షం పడితే ప్రధాన పంటలు సాగు చేసుకోవాలి. వచ్చే నెలలో వర్షాలు పడినా వేరుశనగ, ఇతర ప్రధాన పంటలు విత్తుకున్నా దిగుబడి కష్టమే. దీనిని దృష్టిలో ఉంచుకుని, రైతులు వచ్చే నెలలో ప్రత్యామ్నాయ పంటలైన కొర్ర, ఉలవ, సజ్జలు, అరసంద తదితర పంటలు సాగు చేసుకుంటే బాగుంటుంది.

వేడుకున్నా.. వినకపోతివే నాన్నా..!

బెళుగుప్ప, జూలై27(ఆంధ్రజ్యోతి): మండలంలోని నక్కలపల్లిలో కుటుంబ కలహాలతో ఆదివారం ఓ తండ్రి... విషపు గుళికలు మింగి, తన ఇద్దరు బిడ్డలకు కూడా మింగించాడు. బిడ్డలు సహా చనిపోవాలనుకున్నాడు. ముగ్గురూ విషమ పరిస్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నక్కలపల్లికి చెందిన రమేష్ రెడ్డి, దివ్యశ్రీ దంపతులు పదెకరాల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారికి ఆరేళ్ల కుమద్విని, నాలుగేళ్ల చైత్ర సంతానం. దంపతులు తరచూ గొడవ పడుతుండేవారు. దీంతో మనస్తాపం చెందిన రమేష్ రెడ్డి ఆదివారం ఉదయం తోటలోకి తన ఇద్దరు కుమార్తెలను తీసుకెళ్లాడు. తొలుత తాను విషపుగుళికలు మింగాడు. తర్వాత ఇద్దరు బిడ్డలతో బలవంతంగా మింగించాడు. బిడ్డలను తీసుకుని ఇంటికొచ్చాడు. విషపు గుళికలు మింగాననీ, తలంతా తిరుగుతోందని తల్లి వెంకటలక్ష్మికి రమేష్ రెడ్డి చెప్పాడు. కుమద్విని కూడా నాన్న తమో ఏవో గుళికలు మింగించాడనీ, వాసన వస్తోందంటూ తల్లి దివ్యశ్రీకి చెప్పి వాంతులు చేసుకుని, సొమ్మసిల్లి పడిపోయింది. వెంటనే తండ్రి, కుమార్తెలను అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. దీనిపై ఫిర్యాదు అందలేదని బెళుగుప్ప పోలీసులు తెలిపారు.

న్యూస్ బాక్స్

అలరించిన నాటిక





నాటికలోని దృశ్యాలు

పుట్టపర్తి, జూలై 27(ఆంధ్రజ్యోతి): సత్యసాయి యూత్ చేపట్టిన శ్రీసత్యసాయి ది బికాన్ ఆఫ్ లవ్ నాటిక భక్తులను అలరింపజేసింది. చెన్నై భక్తులు రెండోరోజు ఆదివా రం సాయంత్రం సాయికుల్వంత్ సభామండపంలో సత్యసాయి ప్రేమతత్వంపై నాటికను ప్రదర్శించారు. సత్యసా యి అనంతమైన ప్రేమతత్వాన్ని, సేవలను సమాజానికి అందించడమే తమ లక్ష్యమంటూ నాటిక ద్వారా తెలియజేశారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి: సీపీఎం



ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

కదిరిఅర్బన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నిరుపేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని అమీన్‌నగర్‌లో సర్వే నంబర్ 294 ప్రభుత్వ భూమిలో ఆ పార్టీ ఆధ్వర్యంలో పేదలతో కలిసి గుడిసెలు వేశారు. వారు మాట్లాడుతూ ఆరు నెలలనుంచి పేదలకు ఇళ్లస్థలాలు కేటాయించాలని సచివాలయం, తహసీల్దార్, కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేశామన్నారు. ఇంటి స్థలాల కోసం దరఖాస్తు చేసుకుని నాలుగు నెలలవుతున్నా రెవెన్యూ అధికారులు కనీసం విచారణకూడా చేయలేదన్నారు. పేదలు ఇంటి అద్దెలు చెల్లించలేక ఇబ్బంది పడుతన్నారని వాపోయారు. ప్రభుత్వ భూమిలో వారికి ఇంటిస్థలాలు కేటాయించాలన్నారు. గుడిసెలు వేసుకున్నవారికి పట్టాలివ్వాలన్నారు. జీఎల్ నరసింహులు, జగన్మోహన్, సాంబశివ, బాబ్‌జాన్, శాంతిబాయి, రామమోహన్, నారాయణ పాల్గొన్నారు.

ఏఎస్ఐకి సన్మానం



బాలకృష్ణను సన్మానిస్తున్న డీఎస్పీ, సీఐలు

కదిరి, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఉద్యోగోన్నతిపై బదిలీ అయిన ఏఎస్ఐ బాలక్రిష్ణకు కదిరి డీఎస్పీ శివనారాయణ స్వామి ఆధ్వర్యంలో స్థానిక డీఎస్‌పీ కార్యాలయంలో ఆదివారం సన్మానించారు. ఏఎస్ఐ బాలక్రిష్ణ కదిరి యూపీఎస్ సర్కిల్ కార్యాలయంలో, డీఎస్పీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ ఎస్ఐగా ఉద్యోగోన్నతి పొందారు. బదిలీ అయిన సందర్భంగా అయనను డీఎస్పీతోపాటు సీఐలు నారాయణరెడ్డి, నాగేంద్ర, నిరంజన్‌రెడ్డి, ఎస్ఐలు గోపి, మక్బూల్ బాషా సన్మానించారు. ఆయన చేసిన చేసిన సేవలను కొనియాడారు. బాలక్రిష్ణ పదోన్నతిపై రైల్వే శాఖకు బదిలీ అయ్యారు.

జిల్లాస్థాయి యోగా పోటీలు

ధర్మవరం, జూలై 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీఎస్ఆర్ మున్సిపల్ బాలికల ఉన్నతపాఠశాలలో ఆదివారం ధర్మవరం యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యోగాసన పోటీలు నిర్వహించారు. పోటీలను బీజేపీ పట్టణ అధ్యక్షుడు జింకాచంద్ర, ప్రధాన కార్యదర్శి సాకే ఓబుశేషు, మున్సిపల్ ప్రాజెక్టు ఆఫీసర్ భాస్కర్‌రాయల్, అధ్యక్షుడు గాజుల సోమేశ్వరరెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. జిల్లాలోని పలుప్రాంతాల నుంచి వివిధ కేటగిరీలలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు యోగా సంఘం జిల్లా అధ్యక్షుడు సోమేశ్వరరెడ్డి సర్టిఫికెట్‌లు, మెడల్స్ అందజేసి అభినందించారు. సత్రసాల ప్రసన్నకుమార్, రాజశేఖర్‌రెడ్డి, సుబ్బరాయుడు, యోగా మాస్టర్లు సాకే ఈశ్వరయ్య, తిరుమలేశ్, వెంకటలక్ష్మయ్య, కట్టా రవికుమార్, దాసరి శ్రీనివాసులు, పులిచెర్ల రవీంద్ర, ఆదినారాయణ పాల్గొన్నారు.

ఇళ్లపైనే విద్యుత్ తీగలు

● భయాందోళనల్లో తండావాసులు
● ఉన్న వైర్ల తొలగింపు
● పట్టించుకోని విద్యుత్ అధికారులు



మిద్దెపై ఉన్న విద్యుత్ వైర్లు

తనకల్లు, జూలై27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోమేనాయక్ తండాలో ఇళ్లపైనే విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి. దీంతో గిరిజనలు ఆందోళన చెందుతున్నారు. తమ ఇళ్లకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు విద్యుత్ అధికారులు గ్రామంలోకి వైర్లు లాగారు. స్తంభాలు లేకపోవడంతో వైర్లు కిందపడుతున్నాయి. గ్రామస్థులే పొడవైన కట్టెలతో విద్యుత్ కనెక్షన్ తీసుకున్నారు. మిద్దెలపైనే విద్యుత్ తీగలు వెళ్లడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. తండాలో విద్యుత్ స్తంభాలు నాటి వైర్లు తొలగించారు. దీంతో చుట్టుపక్కల ఇళ్లవారు విద్యుత్‌కోసం మరో స్తంభంనుంచి వైర్లు తీసుకోవడంతో వైర్లు ఇళ్లపైనే వేలాడుతున్నాయి. దీనిపై సంబంధిత విద్యుత్ అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని ప్రజలు మండిపడుతున్నారు. అధికారులు స్పందించకపోతే ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు.



కట్టెలసాయంతో గ్రామంలోకి విద్యుత్ తీగలను తీసుకెళ్లిన దృశ్యం

చివరి ఆయకట్టుకు నీరు అందించడమే లక్ష్యం

● తూముల ద్వారా నీటిని విడుదల చేసిన టీడీపీ నాయకులు

ధర్మవరం, జూలై 27(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో చెరువులు నిండినా తూముల ద్వారా నీటిని విడుదల చేయకుండా ఆయకట్టు సాగును తగ్గించారని, కూటమి ప్రభుత్వంలో ధర్మవరం చెరువుకింద చివరి ఆయకట్టు వరకు నీటిని వదిలి పంటలు పండించే విధంగా చర్యలు చేపట్టామని ఏపీ సీడ్స్‌రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ కమతంకాటమయ్య, మహేశ్‌చౌదరిలు అన్నారు. ఆదివారం ధర్మవరం చెరువు కట్ట రెండో తూము వద్ద సాగునీటి సంఘం చైర్మన్ శ్రీనివాసులుతో కలిసి పంట సాగుకు నీటిని విడుదల చేశారు. వారు మాట్లాడుతూ పార్టీ ప్రతిపక్షంలో ఉండగానే ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సొంత నిధులతో చెరువుకింద కాలువల్లో జంగిల్ క్లియరెన్స్ చేపట్టామన్నారు. 1500 ఎకరాలు రైతులు సాగు చేసేందుకు సిద్ధం చేస్తున్నామన్నారు. ఆయకట్టు కింద తుమ్మల చిన్నూరు, మల్లేనిపల్లి, ధర్మపురి గ్రామాలకు నీటిని విడుదల చేశారు. సాగునీటి సంఘం చైర్మన్ రేనాటి



తూముల నుంచి నీటిని విడుదల చేస్తున్న కమతం కాటమయ్య, నాయకులు

శ్రీనివాసులు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, డీలర్ కుళ్లాయప్ప, నాయకులు షరీఫ్, విజయసారధి, రామాంజి, విజయ్‌చౌదరి, రమణ, సుధాకర్, చెరువు సంఘం డైరెక్టర్లు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం అడుగుజాడల్లో నడుద్దాం



కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

ధర్మవరం, జూలై 27(ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం అడుగుజాడల్లో విద్యార్థులు నడవాలని యువర్స్ ఫౌండేషన్ సభ్యులు అన్నారు. అబ్దుల్‌కలాం వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అందరూ ఆయన ఆశయ సాధనకు పాటపడాలన్నారు. ఫౌండేషన్ కార్యదర్శి జయరాం, సభ్యులు చాంద్‌బాషా, ప్రసాద్, లోకేశ్ పాల్గొన్నారు. అలాగే బ్రిలి



నల్లమాడలో నివాళి అర్పిస్తున్న విద్యార్థులు

యంట్ పాఠశాలలో కరస్పాండెంట్ శేషు, విద్యార్థులు అబ్దుల్‌కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

నల్లమాడ: మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ఆవరణంలో ఆర్ఎంపీ వైద్యులు బుట్టినాగభూషణనాయుడు ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. అబ్దుల్‌కలాం విగ్రహానికి పూలమాలు వేసి నివాళి అర్పించారు. కోట్లో మంజునాథ్‌రెడ్డి, అరవిందు, నారాయణనాయక్, పొరకల అభి పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత



ధ్యానంపై అవగాహన కల్పిస్తున్న మాస్టర్లు

బత్తలపల్లి, జూలై 27(ఆంధ్రజ్యోతి): ప్రతి రోజూ ధ్యానం చేయడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని ధాన్యం మాస్టర్లు సుబ్బరత్నమ్మ, క్రిష్ణమూర్తి అన్నారు. స్థానిక హరిహర పిరమిడ్ ధాన్య మందిరంలో ఆదివారం ఆనందం కార్యక్రమాన్ని నిర్వహించారు. ధ్యానంపై అవగాహన కల్పించారు. ఆత్మ ధ్యానం, బాహ్య శరీరం, సూక్ష్మ శరీరం కారణ శరీరంపై అవగాహన కల్పించారు. మాస్టర్లు మాట్లాడుతూ ప్రతి రోజూ ధ్యానం చేయడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ధ్యానంతో ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. కప్పలకొండన్న జ్ఞాపకార్థం హాజరైన వారికి భోజన ఏర్పాట్లు చేశారు. ధాన్యం మాస్టర్లు కొండన్న, నాగేంద్ర, లక్ష్మీదేవి, గోపాల్, యశోద పాల్గొన్నారు.

వృద్ధురాలికి రేషన్ పంపిణీ

బుక్కపట్నం, జూలై 27(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధురాలికి ఇంటికెళ్లి టీడీపీ తెలుగు యువత మండల అధ్యక్షుడు సాకే నరేష్ ఆదివారం రేషన్ బియ్యం అందించారు.



వృద్ధురాలికి రేషన్ పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

చింతలయ్యగారిపల్లి గ్రామానికి చెందిన ఒంటరి వృద్ధురాలు కొద్దిరోజులుగా అనారోగ్యంతో మంచానికే పరిమితమయ్యారు. వృద్ధురాలి అవస్థలు గమనించిన డీలర్ భాస్కర్‌తో కలిసి ఆమె ఇంటికెళ్లి రేషన్ సరుకులు అందించారు. నాయకులు శ్రీనివాసులు, నరేష్‌యాదవ్ పాల్గొన్నారు.

యువతరానికి అబ్దుల్ కలాం స్ఫూర్తి

పుట్టపర్తిరూరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి)! భారతరత్న డాక్టర్ అబ్దుల్ కలాం నేటి యువతరానికి స్ఫూర్తిదాయకం అని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి అన్నారు. అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా వారు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. అబ్దుల్ కలాం ఒక శాస్త్రవేత్త, రాజనీతిజ్ఞుడు మాత్రమే కాదనీ, ఆయన నేటి యువతరానికి ఎంతో ఆదర్శమన్నారు. కలలు కనండి కలలను సాకారం చేసుకోవడానికి అవిరళ కృషి చేయండి అన్న ఆయన సందేశం అందరిలో స్ఫూర్తిని కలిగిస్తోందన్నారు.

కులగణన చేపట్టాలి

ధర్మవరం, జూలై 27(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కులగణన చేసి బీజేపీ రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగించాలని, లేదంటే దేశవ్యాప్తంగా ప్రజాగ్రహానికి గురికాకతప్పదని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు తుంపర్తి పరమేశ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.లోకనాయకుడు అట్టడుగు వర్గాలకు బాసటగా నిలిచిన రాహుల్‌గాంధీ సారధ్యంలో కులగణన చేసి నిరూపించడం భవిష్యత్ తరాలకు ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. దేశ ప్రజల సంక్షేమంకోసం పార్టీ ఎల్లప్పుడు పనిచేస్తుందన్నారు.

నేడు మీ సమస్య-మా బాధ్యత

ధర్మవరం,జూలై 27(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని 37,38,39,40 వార్డులలో మీ సమస్య-మా బాధ్యత కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్టు టీడీపీ పట్టణఅధ్యక్షుడు పరిశేసుధాకర్, జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తంగౌడ్‌లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి నియోజకవర్గటీడీపీ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ హాజరవుతారన్నారు. అదేవిధంగా మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులు, సచివాలయసిబ్బంది, ఆయా వార్డుల టీడీపీ ఇన్‌చార్జ్‌లు, బూత్ కన్వీనర్‌లు పాల్గొంటారన్నారు.

జూదరుల అరెస్టు

ధర్మవరం రూరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్శినమల గ్రామసమీపంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. అందిన సమాచారం మేరకు ఆదివారం సిబ్బందితో కలసి నిర్వహించిన దాడుల్లో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి వారి నుంచి 6,600 స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సత్యసాయి ప్రేమవాహిని రథోత్సవం



రథాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

కొత్తచెరువు, జూలై 27(ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల సందర్భంగా దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో, జిల్లా కేంద్రా ల్లో సత్యసాయి ప్రేమవాహని రథోత్సవాన్ని సత్యసాయిసెంట్రల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా కొత్తచెరువులో ఆదివారం రథోత్సవాన్ని గ్రామప్రధాన వీధులలో ఊరేగించారు. చిన్నారులు కోలాటం చేస్తుండగా గురవయ్యలు నృత్యాలు చేస్తూ భక్తిపాటలు ఆలపించారు. భక్తులు భజనలు చేస్తూ సత్యసాయి సంకీర్తనాలు ఆలపించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణమూర్తి, శంకరనారాయణ,సీతారామ్, రాజేంద్రప్రసాద్, శ్రీదేవి, కొత్తచెరువు సత్యసాయి భక్తమండలి కన్వీనర్ కొండమీదరాయుడు, ఈశ్వరప్ప, ఆధ్యాత్మిక కన్వీనర్ ఆదినారాయణ పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న చిన్నారులు

ఆక్యుప్రెషర్‌తో మెరుగైన ఆరోగ్యం



ఎస్సీబాలికల వసతిగృహంలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పుట్టపర్తిరూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత యాంత్రిక జీవనంలో ఆక్యుప్రెషర్ చికత్స ఆరోగ్యానికి మెరుగైన లభిస్తుందని ఒడిశాకు చెందిన స్వాస్థ్య సేవాసంఘ్ బృందం థెరపిస్టు సౌమిత్రాదాస్ అన్నారు. ఆదివారం పట్టణంలోని సత్యమ్మ దేవాలయం వద్దనున్న సాంఘిక సంక్షేమ వసతిగృహంలో ఆర్డీఓ సువర్ణ ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఈకార్యక్రమంలో 7 నుంచి 10వ తరగతి విద్యార్థినులకు ఆక్యుప్రెషర్ చికిత్సపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆక్యుప్రెషర్ థెరపిస్టు సౌమిత్రాదాస్ ఆక్యుప్రెషర్ రిఫ్లెక్సాలజీ ప్రాథమికాల శిక్షణ, అవగాహన కల్పించారు. శిక్షణలో విద్యార్థినులకు జ్ఞాపకశక్తి, ఎత్తు పెరుగుదలకు సంబంధించి చికిత్సపై ప్రదర్శనలు ఇచ్చారు. సంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు బికాస్ సాహరా మాట్లాడుతూ ఆక్యుప్రెషర్ చికిత్సతో మానసిక ఒత్తిడిని కూడా అదుపులో ఉంచుతుందన్నారు. ఇది సమగ్ర ప్రత్యామ్నాయ ఆరోగ్య సంరక్షణ చేకూరుస్తుందన్నారు. సంస్థకు చెందిన ఆక్యుప్రెషర్ థెరపిస్టులు లీనాసాహరా, హరేకృష్ణఖుంటియా, శ్రేయకుమారి, యోగా శిక్షకుడు నారాయణరెడ్డి పాల్గొన్నారు.

కూటమి హామీని నెరవేర్చిన సీఐ

ధర్మవరం, జూలై 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివానగర్ ప్రాథమిక పాఠశాల ఆవరణలోకి వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ ఎర్రమట్టిని తోలించి కూటమి ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీని నెరవేర్చారు. శివానగర్‌లో 11వ తేదీ మంత్రి సత్యకుమార్ యాదవ్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్, జనసేన ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి పాదయాత్రలో పాల్గొన్న సమయంలో హెచ్‌ఎం రామేశ్వరరావు పాఠశాల ఆవరణలో వర్షపునీరు వచ్చినప్పుడు నీరు నిల్వఉంటుందని, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. స్పందించిన పరిటాలశ్రీరామ్ వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్‌రే పరిస్థితిని తెలియజేశారు. సీఐ మూడు టిప్పర్లు, ఒక ట్రాక్టర్ ఎర్రమట్టి పాఠశాల ఆవరణంలోకి తరలించి సమస్యను పరిష్కరించారు. హెచ్‌ఎం, 7వవార్డు ఇన్‌చార్జ్ పల్లపు రవీంద్ర, చెలిమి శివరాం కృతజ్ఞతలు తెలిపారు.



ప్రాథమిక పాఠశాల ఆవరణలో తోలిన ఎర్రమట్టి

ఉచితంగా ఫిజియోథెరపీ

తనకల్లు, జూలై27(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ఆదివారం దీక్ష క్లినిక్ ఆధ్వర్యంలో ఉచిత ఫిజియోథెరపీ నిర్వహించారు. ఎస్ఐ గోపీ కార్యక్రమాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఫిజియోథెరపిస్ట్ సాయికుమార్ సిబ్బందితో వందమందికిపైగా రోగులకు ఉచితంగా ఫిజియోథెరపీ చేశారు. మెడ, భుజం, డిస్క్, పెరాలాసిస్‌కు ఫిజియోథెరపీ చేసినట్లు తెలిపారు.

పబ్లిక్ నోటీసు

ఇందుమూలముగా యావన్మందికి మా కక్షిదారులు ధర్మవరం పట్టణ వాస్తవ్యులు తలారి లక్ష్మీదేవి భర్త భోగినేని చెన్నప్ప మరియు తలారి చెన్నమ్మ భర్త బాబయ్య వారి పరంగా తెలియచేయడమేమనగా క్రింది షెడ్యూలు ఆస్తి మా కక్షిదారుల తండ్రి జెన్నె పోతప్ప స్వయార్జితమనియు ఆయన 12-09-1950 తేదీన రిజిస్టరు విక్రయ పత్రము ద్వారా విక్రయము పొందినాడనియు అప్పటి నుండి అతని స్వాధీనా నుభములోనే యున్నదనియు అతని తనదంతరము సదరు ఆస్తి అతని వారసులైన జెన్నె పుల్లన్న మా కక్షిదారులకు సమాన హక్కులతో సంక్రమించినదనియు కానీ కొంతమంది ధనికవర్గం వారు జెన్నె పుల్లన్న భార్య చెన్నమ్మ కుమార్తెలు మొండి చెన్నమ్మ మరియు తలారి భోగిని నాగమ్మ గార్లతో క్రింది షెడ్యూలు యావదాస్తిని విక్రయము పొందినారనియు దొంగపత్రములతో మాక్షిదారులను బెదిరించు చున్నారనియు మా కక్షిదారుల 2/3 భాగమును ఎవ్వరు కూడా విక్రయించుటకు గాని విక్రయము పొందుటకు గాని ఎలాంటి హక్కు గాని అధికారము గాని లేదనియు "హక్కులేని వారిచే విక్రయము పొందిన వారికి ఎలాంటి హక్కు రాదనియు" అట్లు చేయుట నేరమనియు తెల్పాడమైనది. మా కక్షిదారుల 2/3 హక్కును అనంతపురము జిల్లా కోర్టు O.S.18/2005లో ధృవీకరించడమైనది. ఇలాంటి దొంగ విక్రయ పత్రముల ద్వారా మా కక్షదారుల హక్కులకు భంగము కలిగిస్తూ వారి స్వాధీనానుభవములకు ఆటంకము చేయుచున్నారనియు వారి మీద Cheating, Forgery, Fabrication of Documents మరియు False claim నేరములకు చట్టరీత్యా తగిన చర్యలు తీసుకొనబడునని తెలియజేయడమైనది.

షెడ్యూలు

Land situate in the R.D.Anantapuramu, S.R.D. of Dharmavaram Within the revenue Village Limits of Dharmavaram, Dharmavaram Mandal.

Nature	S.No.	Extent	Remarks
G.Dry.	640-1	7.44 AC	Full

Boundaries: East: Road, **South:** Lands of Medapuram Village People, **West:** Lands of Peddaiah and others, **North:** Road.

P.Venkata Subbaiah, B.A., B.L.,
P.Venkateswara Prasad, B.A., L.L.B.,
Advocates, Dharmavaram.

నీటి సరఫరా కార్మికుల సమస్య పరిష్కారం

ధర్మవరం, జూలై 27(ఆంధ్రజ్యోతి): ముదిగుబ్బ మండలకేంద్రంలో 15 రోజులుగా సమ్మె చేస్తున్న సత్యసాయి వాటర్ ప్రాజెక్టు కాంట్రాక్ట్ కార్మికుల సమస్యపై మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పందించారు. కార్మికులకు 9 నెలలుగా జీతాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ ప్రాజెక్టులో పనులు నిలిపివేసి నిరసన వ్యక్తం చేశారు. విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో తక్షణమే స్పందించి కలెక్టర్‌తో ఫోన్‌లో ద్వారా మాట్లాడారని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరీశ్‌బాబు తెలిపారు. కార్మికుల సమస్యను వివరిస్తూ వెంటనే జీతాలు చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారన్నారు. మంత్రి ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు రెండు రోజుల్లో పెండింగ్‌లో ఉన్న జీతాలను చెల్లించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

గాండ్లపెంట, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కటారుపల్లి పంచాయతీలో జరిగిన పలు అభివృద్ధి పనులను నేషనల్ లెవల్ మానిటరింగ్ బృందం సభ్యుడు దయాకర్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. కటారుపల్లిలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో భాగంగా కటారుపల్లి క్రాస్‌నుంచి కటారుపల్లి వరకు పంచాయతీ రాజ్ నిధులతో వేసిన రోడ్డును పరిశీలించారు. అనంతరం కస్తూర్బా పాఠశాల వెనుక భాగాన నిర్మించిన ఇంకుడుగుంతను పరిశీలించారు. ఇంకుడుగుంత వల్ల భూమిలోకి వృథా నీరు వెళ్లి నీటి మట్టం పెరిగే అవకాశ ముంటుందన్నారు. అనంతరం సచివాలయలో ఏర్పాటు చేసిన మహిళా పొదుపు సంఘాలు, వృద్ధాప్య పింఛన్లు, గృహనిర్మాణాలు తదితర శాఖల పనితీరుపై గ్రామస్థులతో చర్చించారు. ఉపాధి పథకంలో చేపట్టిన ఫాంపాండ్ గుంతలు, కందకాలను పరిశీలించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న ప్రతిపని అందరికీ ఉపయోగపడేలా అధికారులు చొరవ చూపాలన్నారు. ఎలాంటి దుర్వినియోగానికి పాల్పకూడదని సూచించారు. కటారుపల్లి ప్రజల జీవన స్థితిగతులపై ఆరాతీశారు. పంటల సాగుపై రైతులతో చర్చించారు. ఈడీ విజయేంద్రప్రసాద్, ఏపీడీఓ రమేష్‌బాబు, ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి, ఏపీఎం సూర్యనారాయణ, పీఆర్ జేఈ రెడ్డివరప్రసాద్, ఏపీఓ చంద్రశేఖర్, ఎస్ఓ దుర్గా, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న ఎన్ఎల్ఎం టీమ్

వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత

16 మంది ఉండాల్సిన చోట.. ఏడుగురితో విద్యాబోధన

ఇంగ్లిష్, గణితం బోధించేవారే లేరు..

ఆందోళన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు



ఇనగలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

అగళి, జూలై 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యమైన సబ్జెక్టులను బోధించేవారు లేక తీవ్ర ఆందోళనలో ఉన్నారు. అగళి మండలం ఇనగలూరు ఉన్నత పాఠశాలలో 253 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఈ పాఠశాలలో 16 మంది ఉపాధ్యాయులు ఉండాలి. అయితే ఏడుగురు మాత్రమే ఉన్నారు. ఇందులో ఒక పీడీ, హెచ్ఎం, ఐదుగురు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. 16 మంది ఉపాధ్యాయులు ఉండాల్సిన చోట కేవలం ఏడుగురు మాత్రమే విధులు నిర్వహిస్తుండటంతో సరైన బోధన అందక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇంగ్లీషు, గణితం బోధించేందుకు ఉపాధ్యాయులు లేనే లేరు. ఐదవ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఏడుగురు ఉపాధ్యాయులు మాత్రమే బోధన చేయాల్సి వస్తోంది. దీంతో పూర్తిగా బోధన కుంటుపడుతోందని హెచ్ఎం మనోహర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తమ పిల్లలకు విద్యాబోధన సరిగా అందడంలేదని వారి తల్లిదండ్రులు ఆందోళనలో ఉన్నారు. ఈవిధంగా ఉంటే వారు సరైన ఫలితాలను ఏవిధంగా రాబట్టగలరని ప్రశ్నిస్తున్నారు. పూర్తిగా స్టాఫ్‌ను కేటాయించాలని కోరుతున్నారు. ఆరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఒక మోడల్ స్కూల్ ఉంది. ఈ పాఠశాలలో ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. వారు బదిలీ అయ్యాక ఆ పాఠశాలకు ఉపాధ్యాయులు రాలేదు. దీంతో అక్కడి విద్యార్థులుసైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యమైన సబ్జెక్టులకు ఉపాధ్యాయులు లేరని విద్యార్థులు అంటున్నారు. ఇంగ్లీషు, మ్యాథ్స్ హిందీ బోధనకు ఉపాధ్యాయులు లేరని, అరకొర ఉపాధ్యాయులతో బోధన సాగుతోందని అంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమకు పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులను కేటాయించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

మ్యాథ్స్, ఇంగ్లిష్ బోధించేవారు లేరు..



మ్యాథ్స్, ఇంగ్లీషు సబ్జెక్టులను బోధించేవారు లేరు. ఉపాధ్యాయులు అరకొరగా ఉన్నారు. దీంతో మాకు పూర్తిస్థాయిలో విద్యాబోధన అందడంలేదు. చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఉన్నతాధికారులు చొరవ చూపి ఉపాధ్యాయులను కేటాయించాలి

-శశిధర్, పదో తరగతి విద్యార్థి, ఇనగలూరు

ముఖ్యమైన సబ్జెక్టులకు లేరు



ముఖ్యమైన సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులు లేరు. దీంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. తమకు వెంటనే ఉపాధ్యాయులను కేటాయించి పూర్తిస్థాయిలో విద్యాబోధన అందేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరుతున్నా.

-సరిత, 9వ తరగతి విద్యార్థిని, ఇనగలూరు

ఉపాధ్యాయుల కొరత ఉంది

మండల వ్యాప్తంగా ఉపాధ్యాయుల కొరత ఉన్నమాట వాస్తవమే. ముఖ్యంగా ఉన్నత పాఠశాలల్లో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు లేరు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తా.

-ఎంఈఓ-2 చంద్రశేఖర్ నాయుడు

తారు రోడ్డు పనులు పూర్తి

హర్షం వ్యక్తం చేస్తున్న నల్లూరు గ్రామస్థులు


పూర్తయిన నల్లూరు-దందేపల్లి తారు రోడ్డు

రొద్దం, జూలై 27(ఆంధ్రజ్యోతి): నల్లూరు గ్రామానికి తారు రోడ్డు నిర్మాణం పూర్తయ్యింది. మండల పరిధిలోని దందేపల్లి గ్రామం నుంచి నల్లూరు గ్రామం వరకు 2 కి.మీల మేర తారు రోడ్డు పనులు పూర్తయ్యాయి. సరైన రహదారిలేక ఎన్నోఏళ్లుగా ఇబ్బందిపడ్డ గ్రామస్థులు రోడ్డు పనులు పూర్తి కావడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్థుల విన్నపం మేరకు మంత్రి సవిత ఎన్ఆర్ఈజీఎస్ నిధుల కింద రూ.2.24కోట్లతో రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. పనులు పూర్తికావడంతో మంత్రికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. దీనికితోడు రూ.2.80కోట్లతో పెన్నానదిపై బ్రిడ్జి పనులు శరవేగంగా సాగుతున్నాయి. బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయితే రొద్దం నుంచి కొల్లకుంట మీదుగా నల్లూరు, చోళేమర్రి, దందేపల్లి, కొత్తపల్లి, రొప్పాల మీదుగా హిందూపురానికి వెళ్లేవారికి ఇబ్బందులు తొలగనున్నాయి.

ఆలయాలను సందర్శించిన మాజీ మంత్రి


స్వామిని దర్శించుకుంటున్న జానారెడ్డి

మడకశిర రూరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి జానారెడ్డి ఆదివారం నీలకంఠాపురంలోని దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల విశిష్టతను తెలుసుకున్నారు. జానారెడ్డి వెంట మాజీ మంత్రి రఘువీరారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధాకర్, నాయకుడు మంజునాథ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా ప్రాణప్రతిష్ఠ


ప్రాణ ప్రతిష్ఠలో పాల్గొన్న నాయకులు

పరిగి, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్దిరెడ్డిపల్లి గ్రామంలో పెన్నా నది తీరంలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయస్వామి ఆలయంలో స్వామివారి విగ్రహానికి ఆదివారం వైభవంగా ప్రాణప్రతిష్ఠ జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్థుల పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, సర్పంచ్ బాలాజీ, జిల్లా తెలుగు యువత కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, జూలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో రాణించిన విద్యార్థులు


విద్యార్థులతో మాస్టర్లు

హిందూపురం, జూలై 27(ఆంధ్రజ్యోతి): నేషనల్ లెవెల్ కరాటే ఓపెన్ చాంపియన్‌షిప్‌లో హిందూపురానికి చెందిన కరాటే విద్యార్థులు ప్రతిభను చాటినట్లు మాస్టర్ ఫైరోజ్ తెలిపారు. బెంగళూరులో నిర్వహించిన పోటీల్లో హిందూపురానికి చెందిన నేహా, ప్రవీణ్, వరాహ, శివశంకర్, ప్రజ్ఞ, అమూల్య, శరణ్య ఈషాంత్, అక్షయ, వంశీకృష్ణలు పాల్గొని చక్కటి ప్రతిభ కనబరచారు.

సీఐ శేఖర్‌కు ఎస్పీ ప్రశంస



సీఐ శేఖర్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ రత్న

గోరంట్ల, జూలై 27(ఆంధ్రజ్యోతి): స్థానిక అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐ శేఖర్‌ను ఎస్పీ రత్న ప్రశంసాపత్రాన్ని అందించారు. పుట్టపర్తి ఎస్పీ కార్యాలయంలో 6 నెలల క్రైం రివ్యూ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలో ఆరు నెలలకాలంలో బెస్టుప్రాపర్టీ రికవరీతోపాటు లోక్‌అదాలత్ ద్వారా అధిక సంఖ్యలో కేసుల పరిష్కారానికి గోరంట్ల పోలీసులు కృషి చేయడంతో ఎస్పీ వారిని ప్రత్యేకంగా గుర్తించారు. సీఐ శేఖర్ తోపాటు కానిస్టేబుల్ రవికుమార్, వేణుగోపాల్‌రెడ్డి, వేమనారాయణలకు ఎస్పీ ప్రశంసాపత్రంతోపాటు బహుమతి అందించి ప్రోత్సహించారు. ఎస్పీ ప్రశంసాలు అందుకున్న పోలీసులను పలువురు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పెనుకొండ డీఎస్పీ నరసింగప్ప ఉన్నారు.

ఎరుకల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడి ఉమాశంకర్


ఉమాశంకర్

గోరంట్ల, జూలై27(ఆంధ్రజ్యోతి): ఎరుకల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గోరంట్లకు చెందిన టీడీపీ నాయకుడు దేవరకొండ ఉమాశంకర్ నియమితులయ్యారు. సంఘం అభివృద్ధికోసం తనవంతు కృషిచేస్తానని ఉమాశంకర్ తెలిపారు. తనకు పదవి అప్పగించిన అధ్యక్షులు రాంబాబు, కమిటీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతిఒక్కరి సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే ఎంఎస్ రాజు


మాట్లాడుతున్న ఎంఎస్ రాజు

మడకశిర టౌన్/రొళ్ల, జూలై 27(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరి సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. ఆదివారం రొళ్ల మండల కేంద్రంలో జరిగిన సింగిల్ విండో అధ్యక్షుడు దాసిరెడ్డి ప్రమాణస్వీకారానికి ఆయన హాజరై మాట్లాడారు. కార్యక్రమానికి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి, ఏడీసీసీ బ్యాంకు అధ్యక్షులు కేశవరెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో కష్టపడిన వారికి తప్పకుండా గుర్తింపు ఉంటుందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే అభివృద్ధి పరుగులు పెడుతుంటే వైసీపీ నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. కేశవరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ సహకార బ్యాంకు రుణాలను రైతన్నలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సింగల్ విండో కార్యాలయం అవరణంలో కాంప్లెక్స్ భవన మరమ్మత్తులకు రూ.5లక్షల నిధులు మంజూరు చేస్తున్నాట్లు తెలిపారు. నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు పార్థసారథిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, మార్కెట్ యార్డు చైర్మన్ గురుమూర్తి, మండల కన్వీనర్ ఈరన్న, మాజీ జడ్పీటీసీ సభ్యులు పాండురంగప్ప, సన్నతిమ్మప్ప, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు క్రిష్ణమూర్తి పాల్గొన్నారు.

అగళి, (ఆంధ్రజ్యోతి): పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి సముచిత స్థానం కల్పించడం తథ్యమని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. ఆదివారం అగళి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సింగిల్ విండో అధ్యక్షుడు కుమారస్వామి ప్రమాణస్వీకారానికి ఎమ్మెల్యేతోపాటు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ కేశవరెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేసిన వారిని పార్టీ మరువదన్నారు. కుమారస్వామి అందరికీ అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, జడ్పీటీసీ ఉమేష్, మడకశిర మార్కెట్‌యార్డ్ చైర్మన్ గురుమూర్తి, సింగల్ విండో కార్యదర్శి భోజన్న, ఒక్కలిక కార్పొరేషన్ చైర్మన్ పాండురంగప్ప పాల్గొన్నారు

వైభవంగా శ్రీచక్రపూజ


శ్రీచక్రపూజలో పాల్గొన్న భక్తులు

మడకశిర టౌన్, జూలై27(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వెలసిన షిర్డీసాయినాథుడి ఆలయంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం శ్రీచక్రపూజను కన్నులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని శ్రీచక్రపూజలో పాల్గొన్నారు.

విజయవంతం చేయండి: బీజేపీ


సమావేశమైన బీజేపీ నాయకులు

గోరంట్ల, జూలై27(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని మండల కన్వీనర్ బోయ లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం గోరంట్ల పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈనెల 31న మాధవ్ పుట్టపర్తిలో పర్యటించనున్నారని తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడి పర్యటన సందర్భంగా పార్టీ కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పుట్టపర్తికి తరలివెళ్లేలా చూడాలన్నారు. సమావేశంలో బీజేపీ మేదర శ్రీనివాసులు, శంకర్‌రెడ్డి, నాగరాజుయాదవ్, చలం, శంకర్, వడల శంకర్, జగన్, అశోక్, రామాంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠకు ఆహ్వానం


ఎంపీ బీకే పార్థసారథిని ఆహ్వానిస్తున్న గ్రామస్థులు

రొద్దం, జూలై27(ఆంధ్రజ్యోతి): మండలంలోని శేషాపురం గ్రామంలో ఆగస్టు 5, 6, 7వ తేదీల్లో నిర్వహించనున్న ఆదినారాయణ, పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహాల ప్రతిష్ఠకు రావాలని ఎంపీ బీకే పార్థసారథిని గ్రామస్థులు ఆదివారం ఆహ్వానించారు. అనంతపురంలోని ఆయన నివాసంలో ఈ మేరకు ఆహ్వానం పలికారు. డీలర్ శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ సుధాకర్, శ్రీనివాసులు, ఆలయ కమిటీ ఎంపీని కలిసిన వారిలో ఉన్నారు.

సమస్యలు పరిష్కరించండి: ఎన్ఎంయూ



నిరసన తెలుపుతున్న ఎన్ఎంయూ నాయకులు

మడకశిర టౌన్, జూలై 27(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని ఎన్ఎంయూ నాయకులు ఆదివారం నిరసన తెలిపారు. ఆర్టీసీ డిపోముందు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేశారు. ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎంయు నాయకులు సుబ్బరాయుడు, రామక్రిష్ణ పాల్గొన్నారు.

క్రీడాకారులకు తోడ్పాటు: యూటీఎఫ్

పెనుకొండ రూరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): పెనుకొండ డివిజన్‌లో క్రీడాకారులకు యూటీఎఫ్ ఎంతో తోడ్పాటు అందిస్తోందని నాయకుడు రామాంజనేయులు అన్నారు. రిటైర్డ్ పీఎస్ హెచ్ఎం జ్ఞాపకార్థం జిల్లాస్థాయి టీచర్స్ క్రికెట్ టోర్నీ పెనుకొండ పట్టణంలో ఆదివారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు మరింత తోడ్పాటునందిస్తామన్నారు. కార్యక్రమంలో నరేష్ కుమార్, డివిజన్ నాయకులు ఉపేంద్ర, గంగాధర్, శివయ్య, ఆది జినేష్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

అనంత ఎంపీకి వాల్మీకి నాయకుల సన్మానం


ఎంపీని సన్మానిస్తున్న గౌరిబిదనూరు వాల్మీకి సంఘం నాయకులు

హిందూపురం, జూలై 27(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని గౌరీబిదనూరులో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను గౌరీబిదనూరు వాల్మీకి సంఘం నాయకులు సత్కరించారు. ఆదివారం అక్కడ జరిగిన ప్రైవేట్ కార్యక్రమానికి అంబికా హాజరు కాగా వాల్మీకి సంఘం నాయకులు బాబన్న ఆధ్వర్యంలో అంబికాను సత్కరించారు. కార్యక్రమంలో గౌరీబిదనూరుకు చెందిన వాల్మీకి నాయకులు అశోక్, ప్రభాకర్, హిందూపురానికి చెందిన వాల్మీకి సంఘం నాయకులు వెంకటరమణప్ప, ఆదినారాయణప్ప, అంజి, మాజీ జెడ్పీటీసీ సూరీ ఉన్నారు.

వైసీపీవి జిమ్మిక్కులు: టీడీపీ

హిందూపురం, జూలై 27(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు జిమ్మిక్కులు చేస్తున్నారని టీడీపీ పట్టణ కన్వీనర్ ప్రెస్ వెంకటేశ్ అన్నారు. పట్టణంలోని మోడల్ కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్తలు వైసీపీలో చేరినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ఆదివారం కొంతమంది తెలుగుదేశం పార్టీకి చెందినవారు వైసీపీలో చేరారంటూ వైసీపీ నాయకులు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారని, దీనిపై స్పందించిన టీడీపీ నాయకులు వెంకటేశ్, మురళి మోడల్ కాలనీలో ఆరాతీయగా వైసీపీలో ఎవరూ చేరలేదని తెలిసిందన్నారు. వైసీపీకి చెందిన వారినే పార్టీలోకి చేర్చుకుని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.

12వ పీఆర్సీ వెంటనే అమలు చేయాలి

యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్


మాట్లాడుతున్న సురేష్‌కుమార్

పెనుకొండ, జూలై 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 13 నెలలు అవుతున్నా ఉపాధ్యాయులకు 12వ పీఆర్సీ అమలు చేయకపోవడం దారుణమని యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్ అన్నారు. వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎంఎస్‌వీ రెసిడెన్సియల్‌లో యూటీఎఫ్ జిల్లాస్థాయి స్టడీ సర్కిల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సురేష్‌కుమార్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఏలతోపాటు ఆర్థిక బకాయిలు వెంటనేవిడుల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ గౌరవాధ్యక్షుడు బూతప్ప, కార్యదర్శులు లక్ష్మీనారాయణ, శివశంకర్, క్రిష్టప్ప, నరసింహప్ప, మహలింగప్ప, నాగేష్, ఆజాంబాష, సురేష్, లక్ష్మీపతి, శ్రీనివాసులు, గిరియప్ప తదితరులు పాల్గొన్నారు.

కగ్గ పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ తదితరులు

హిందూపురం, జూలై 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంజీఎం పాఠశాలలో ఆదివారం కగ్గ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ రమేష్, ఎంఈఓ గంగప్ప హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో శ్రీకృష్ణదేవరాయల గ్రంథమాల ఆధ్వర్యంలో కన్నడ, తెలుగు భాషల్లో ముక్కుతిమ్మన కగ్గ పుస్తకాన్ని ఆవిష్కరించడం అభినందనీయమన్నారు. ఈ రెండు భాషలను గౌరవిస్తూ ప్రజలను చైతన్యవంతం చేసేలా ఉందన్నారు. ఇలాంటి పుస్తకాలు మరిన్ని రావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం జీవరత్నమ్మ, కల్లూరు రాఘవేంద్రరావు, ఉమర్‌ఫారూక్, ఉదయ్‌కుమార్, గంగిరెడ్డి, హైదర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

గర్వించదగ్గ శాస్త్రవేత్త అబ్దుల్ కలాం

- యాదవ కార్పొరేషన్ డైరెక్టర్


కలాం విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

పెనుకొండ టౌన్, జూలై27(ఆంధ్రజ్యోతి): భారతదేశం గర్వించదగ్గ శాస్త్రవేత్త ఏపీజే అబ్దుల్ కలాం అని యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కేశవయ్య అన్నారు. అబ్దుల్ కలాం 10వ వర్ధంతిని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఆదర్శవంతమైన నాయకుడు మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కాలం అని, దేశంపై ఆయన చూపిన అంకిత భావం అసాధారణమన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ కన్వీనర్ శ్రీరాములు, త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, బీజేపీ నాయకుడు రామకృష్ణ, ప్రజా సంఘాల నాయకులు పెద్దన్న, రామాంజినేయులు, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాపోటీల్లో విద్యార్థుల ప్రతిభ


బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

పెనుకొండ, జూలై 27(ఆంధ్రజ్యోతి): సరస్వతి మందిరం విద్యార్థులు క్రీడల్లో ప్రతిభచాటారు. ఉభయజిల్లాల సరస్వతి విద్యామందిరాల క్రీడలు ఆదివారం గుంతకల్లులో జరిగాయి. ఈ పోటీల్లో పెనుకొండ సరస్వతి విద్యామందిరం విద్యార్థులు హైజంప్, షార్ట్‌పుట్, లాంగ్‌జంప్, రన్నింగ్‌రేస్, ఖోఖో తదితర విభాగాల్లో ప్రతిభచాటారు. షీల్డ్‌లను గెలుచుకున్నారు. వీరికి జిల్లా కమిటీ సభ్యులు బహుమతులు అందజేశారు. విజేతలను హెచ్ఎం పద్మజ, కమిటీ సభ్యులు సుధాకర్‌గుప్త, పాలూరి క్రిష్ణమూర్తి, నామామురళి, బక్సంపల్లి రామక్రిష్ణ, జయలక్ష్మమ్మ, చలపతిరావు అభినందించారు.

ప్రజల అభివృద్ధే లక్ష్యం: టీడీపీ


అభివృద్ధి పనులను వివరిస్తున్న టీడీపీ నాయకులు

పరిగి, జూలై 27(ఆంధ్రజ్యోతి): సామాన్య ప్రజల అభివృద్ధి లక్ష్యమని టీడీపీ నాయకులు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో పాత దళిత కాలనీలో స్థానిక టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను వివరించారు. అదే విధంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పంచాయితీ అధ్యక్షుడు తిప్పేస్వామి, వడ్డె శ్రీనివాసులు, అచ్యుత్, ఆదిమూర్తి, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

హిందూపురం, జూలై 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు ముందున్న సప్తగిరి లాడ్జిలో పేకాట ఆడుతుండగా పోలీసులు మెరుపుదాడిచేసి 24మంది జూదరులను అరెస్టుచేసినట్లు వన్‌టౌన్ సీఐ రాజగోపాల్‌నాయుడు తెలిపారు. శనివారం అర్ధరాత్రి సమయంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో సీఐలు ఆంజనేయులు, జనార్దన్, అబ్దుల్ కరీం దాడి చేయడం జరిగిందన్నారు. రెండు రూముల్లో పేకాట ఆడుతుండగా 24మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి పది ద్విచక్రవాహనాలు, రూ.51వేలు నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. అయితే ఈలాడ్జి అధికార పార్టీకి చెందిన నాయకుడిది కావడం విశేషం.